# అరె! ఏమయింది

చేతక్ స్కూటర్ స్టార్ట్ చేసి కూర్చున్నాడు. అయిదున్నర అడుగుల పొడవు, రెండున్నరడుగుల వెడల్పు స్థూలకాయుడు ఆనంద్.

సాహితి యింట్లోంచి తెమిలివచ్చి, వెనుక సీట్లో కూర్చుంది. బయలుదేరుతుండగా వెనక నుంచి 'ఆనంద్' అంటూ కేకేశాడు మిత్రుడు వెంకటేశ్. దగ్గరకు వచ్చి రెండు నిముషాలు కబుర్లు చెప్పి, ప్రక్కింట్లో దూరాడు వెంకటేశ్.

అతనటు వెళ్ళగానే స్కూటరు బయలుదేరింది. వారం రోజులుగా హోటల్ విష్ణుప్రియ సెంట్రల్ హాల్లో 20 నుంచి 50 శాతం డిస్కౌంట్ సేల్స్ ఎగ్జిబిషన్‌కు పోయి బెడ్‌స్ప్రెడ్స్ కొనాలన్న సాహితి మాట మీద యీ రోజు బయలుదేరాడు ఆనంద్.

విష్ణుప్రియ ముంగిట స్కూటర్ ఆపి, దిగుతూ 'అరె! ఏమయింది సాహితి? వెనుక సీటు ఖాళీగా వుందే!' అని గాభరా పడ్డాడు ఆనంద్. 'బజార్లో రామావతారం కనుపించినపుడు స్కూటరు ఆపి. ఒక కాలు క్రింద ఆన్చి మాట్లాడినపుడు, వీళ్ళు కబుర్లు త్వరగా ముగించరులే అని, ఆ ప్రక్క షాపులోకి వెళ్ళి వుండవచ్చు' అన్న అయిడియా వచ్చి కాస్త స్థిమితపడ్డాడు. ఏ షాపులోనయినా బొమ్మలకు సింగారించిన చీరలను అద్దాల్లోంచి చూచి ముచ్చటపడడం, వాటి మీద మోజు పడడం మామూలే సాహితికి.



'చూచుకోకుండా యింత దూరం రావడం నాదే పొరబాటు' అని వచ్చిన దోవనే వెతుక్కుంటూ వెళ్ళాడు.

బజార్లో రామావతారం కలిసిన చోటుకు వచ్చి, స్కూటర్ దిగి, లాక్ చేసి, అటూ యిటూ వున్న నాలుగయిదు పెద్ద షాపుల్లోకి తొంగి చూశాడు. ఎక్కడా సాహితి జాడ లేదు. బహుశా నేను కనబడలేదని, వెతుక్కుంటూ వస్తాడులే అని, చివరి షాపుల వరకు వెళ్ళి వుండవచ్చని, ఒక వరుసన పడి బజార్లో షాపులన్నీ తిరిగి చూశాడు. ఎక్కడా కనబడక పోవడంతో మరింత ఆదుర్దా పడ్డాడు ఆనంద్.

స్కూటర్ మీద స్వారీ చేసే పిల్లియన్ రైడర్స్ ఎగిరి పడిపోయిన ఆక్సిడెంట్లను గూర్చి తాను విన్న వార్తలన్నీ గుర్తుకువచ్చి గుండె దిగ జారినట్లయింది ఆనంద్‌కు. 'అయినా నేనంత స్పీడుగా రాలేదే. నాకు తెలియకుండా, ఎదురువచ్చిన వాహనాల్లో ఎవరూ గుర్తించకుండా, యిలాంటి ప్రమాదం జరిగి వుంటుందనుకోవడం అంతా భ్రమేనని, యింటిదారి పట్టాడు ఆనంద్. అయినా సాహితికి ఏమయిందో అన్న ఆలోచనతో చేతులు వణకడంతో కాసేపు స్కూటర్ దిగి నిలుచున్నాడు.

'సాహితికి ఎలాంటి ప్రమాదం జరగకుండా, బజార్లోనే తప్పిపోయి, నన్ను తిట్టుకుంటూ, ఆటోలో యింటికి క్షేమంగా చేరుకుంటే చాలని ఏడుకొండల స్వామికి మొక్కుకుంటూ, యింటికి నిదానంగా చేరుకున్నాడు ఆనంద్.

చెల్లెలితో నిక్షేపంగా కబుర్లాడుతున్న సాహితి గొంతు విని, ఎగిరి గంతు లేసింది ఆనంద్ మనస్సు. స్కూటర్ శబ్దం విని వాకిట్లోకి వచ్చింది సాహితి. "ఏమండీ నన్ను తీసుకుపోకుండా ఎక్కడికి వెళ్ళారింత సేపు? మీరు మీ ఫ్రెండ్ వెంకటేశ్ గారితో కబుర్లలో దిగడం చూసి, స్కూటర్ దిగి, బాత్‌రూంకు వెళ్ళి, వెంటనే వచ్చి చూస్తే మీరు లేరు. ఏదో అర్జెంటు పని తగిలి, వెంకటేశ్ గారితో ఎక్కడకో వెళ్ళుంటారు. త్వరగా వచ్చేస్తారని మీకోసం ఎదురుచూస్తూ కూర్చున్నానంది సాహితి విసుక్కుంటూ.

ఆనంద్ ఎంతో ఆనందంగా జరిగినదంతా చెప్పి, వాళ్ళిద్దరి నవ్వుల్లో తానూ కలిసి పెద్దగా నవ్వేసి ఎంతో రిలీఫ్ పొందాడు. ఇది జరిగినప్పటినుండి, "సరిగా కూర్చొన్నావా? ఇక పోనిచ్చేదా?" అని వెనుక కూర్చొన్న వారిని అడిగి బయలుదేరడం అలవాటు చేసుకున్నాడు ఆనంద్.

—కె.ఆర్.సి.రెడ్డి

7-4-89 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక